విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న గోపాల్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ట్యాలెంట్ టెస్టులు దోహద పడుతాయని నారాయణ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రమా సిందూర అన్నారు. శనివారం రవీంద్రభారతిలో సీఎస్‌పీ ఎస్.ఒలంపియాడ్స్–2025 ఫలితాల్లో, ఒలంపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థులను ఇంటి వద్ద తల్లిదండ్రులు సైతం ప్రోత్సహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక యుగంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణ గ్రూఫ్ ఆఫ్ స్కూల్స్ జనరల్ మేనేజర్ కె.గోపాల్‌రెడ్డి, సీఎస్ కృష్ణ ప్రసాద్, మురళీకృష్ణ, ఎం.రామేశ్వర్‌రావు, నాగేంద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి చెస్ టోర్నమెంట్ పోటీలు

చార్మినార్: ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు పాతబస్తీ ఉర్దూఘర్‌లో ఓపెన్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్–2025 నిర్వహించనున్నామని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తెలిపారు. ఈ చెస్‌లో పాల్గొనే ఔత్సాహిక విద్యార్థులు 85002 12306లో సంప్రదించి ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరిగే స్విస్ లీగ్ లేటెస్ట్ టైబ్రేకర్స్‌తో కొనసాగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు గెలిచినా..ఓడినా అన్నీ రౌండ్లలో పాల్గొనవచ్చునన్నారు. ఈ చెస్ పోటీల్లో విజేతలకు ఈ నెల 23న రాత్రి 7 గంటలకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేయనున్నామన్నారు. ఈ చెస్ పోటీలను చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ ప్రారంభించనున్నారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే ఔత్సాహికులకు ముందు వచ్చిన వారికి ముందుగా అవకాశం కల్పిస్తున్నామన్నారు.

కవి హరనాథ్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కవి హరనాథ్

చాంద్రాయణగుట్ట: 1970 నుంచి పాత నగరానికి చెందిన కవి కొరుప్రోలు హరనాథ్ తెలుగు సాహిత్య రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా డాక్టరేట్ వరించింది. లెజెండరీ పీస్ అవార్డ్స్ కౌన్సిల్ తరపున న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో శనివారం ఆయనకు సఫాయి కర్మచారీస్ జాతీయ కమిషన్ వైస్ చైర్ పర్సన్ అంజనా పన్వార్ డాక్టరేట్(డైనమిక్ ఎక్సలెన్సీ అవార్డు)ను ప్రదానం చేశారు. సాహిత్య రంగంలో దాదాపు ఎనిమిది సంపుటాలు, రెండు ఆంగ్ల సంపుటాలను ప్రచురించి ఇటీవలే సురభి వాణీదేవి చేతుల మీదుగా 'కొరుప్రోలు హరనాథ్ సమగ్ర కవిత్వం'సంకలనం కూడా ఆవిష్కరించారు. ఈయనకు డాక్టరేట్ రావడంపై తెలుగు సాహితీ ప్రియులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సంపుటాల్లో 'మొంబత్తి', 'రహదారి'మొదలగునవి ఆదరణ పొందాయి.

భారీ క్రేన్ కూలిన ఘటనలో వాహనాల తొలగింపు

అబిడ్స్: శుక్రవారం కురిసిన వర్షానికి ఓ భారీ క్రేన్ కూలిపోయి పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. శనివారం వాహనాల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. పెద్ద ఎత్తున ఈదురు గాలులు, భారీ వర్షం రావడంతో రామకృష్ణ థియేటర్ ఎదురుగా ఉన్న భవన నిర్మాణం వద్ద ఓ భారీ క్రేన్ పక్క భవనంపై పడిపోయింది. అదే భవనంలో సెక్యూరిటీ గార్డు గీతా సింగ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదే భవనం కింద ఉన్న బ్లడ్‌బ్యాంక్ బ్లాక్ కూడా ధ్వంసమైంది. కేర్ ఆసుపత్రిలో పనిచేస్తున్న గీతాసింగ్‌కు గాయాలు కావడంతో చికిత్సలు అందిస్తున్నారు. అబిడ్స్ పోలీసులు ఈ భవన నిర్మాణదారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సమస్యలపై ఎన్ఐఆర్‌డీపీఆర్ ఉద్యోగుల వినతి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో అకడమిక్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎన్ఆర్‌డీపీఆర్ చెర్మన్, స్టాండింగ్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు గ్రాంట్ నిలిపివేయడంతో నెలకొన్న ఆందోళనలపై చర్చించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించేలా చూడాలని కమిటీ సభ్యులకు వినతి పత్రం సమర్పించారు.

నిషేధమున్నా..అమలు సున్నా!

- తూతూ మంత్రంగానే ప్లాస్టిక్ నిషేధం
- బేగంబజార్‌లో 100 మైక్రాన్‌లలోపు ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌ల విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



బేగంబజార్‌లో హోల్‌సేల్ ప్లాస్టిక్ విక్రయాలు నిర్వహిస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్లాస్టిక్ నిషేధం తూతూ మంత్రంగానే కొనసాగుతోంది. పాలిథీన్ క్యారీబ్యాగ్‌లు 125 మైక్రాన్‌ల కన్న తక్కువ ఉంటే నిషేధిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలోనే ఆదేశాలు జారీ చేశాయి. ప్లాస్టిక్ వినియోగంతోనే ప్రాణాంతకమైన కేన్సర్ లాంటి జబ్బులు మానవాళికి వస్తున్నాయని వైద్యశాఖ నిపుణులు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. 20, 30, 40, 50 ఇలా 100 మైక్రాన్‌ల లోపు ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌ల విక్రయాలు బేగంబజార్‌లో అక్రమంగా ప్రతిరోజూ బహిరంగంగా వ్యాపారాలు చేస్తున్నారు.

బేగంబజార్‌కు ప్రభుత్వ నిబంధనలు లేవా..?

బేగంబజార్ పరిధిలోని ఫిష్‌మార్కెట్ బేగంబజార్ పోస్టాఫీస్, మిట్టికాషేర్ ప్రాంతాల్లో దాదాపు 200లకు పైగా దుకాణాల్లో ఈ నిషేధిత ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌ల విక్రయాలు కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ లక్షల్లో వ్యాపారాలు సాగుతున్నా ఈ దుకాణాలపై చర్యలు తీసుకునే నాథుడే లేడు. ప్లాస్టిక్‌తో ప్రాణాంతక వ్యాధులు వస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహిస్తూ ప్లాస్టిక్ నిషేధాలు అడ్డుకోలేకపోతున్నారు. బేగంబజార్ నుంచి నగరంలోని పలు ప్రాంతాల హోటళ్లకు, కూరగాయల దుకాణాలకు, వ్యవసాయ మార్కెట్లకు క్వింటాళ్ల కొద్ది ప్లాస్టిక్ కవర్లను ప్రతిరోజూ సరఫరా చేస్తున్నారు. 125 మైక్రాన్‌ల లోపు ప్లాస్టిక్‌ను సరఫరా చేస్తున్నా అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

జీహెచ్ఎంసీ దాడులు ఎక్కడ..?

ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్న ప్లాస్టిక్‌ను బేగంబజార్ హోల్‌సేల్ మార్కెట్‌లో అడ్డగోలుగా వ్యాపారాలు చేస్తున్న జీహెచ్ఎంసీ వైద్య విభాగం అధికారులు దాడులు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ కానీ, జోనల్ కమిషనర్ కానీ ఒక్కసారి స్వయంగా బేగంబజార్‌లో పర్యటిస్తే ప్లాస్టిక్ నిషేధం ఉన్నప్పటికీ 125 మైక్రాన్‌ల లోపు ప్లాస్టిక్‌ను ఎలా విక్రయిస్తున్నారో అర్థమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ ప్లాస్టిక్ విక్రయ దుకాణాలపై దాడులు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్లాస్టిక్ తయారీ కేంద్రాలపై నిఘా లేదా..?

ముఖ్యంగా ప్లాస్టిక్ తయారీ చేస్తున్న కేంద్రాలపై దాడులు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. జియాగూడ, కాటేదాన్, బాబానగర్, ధూల్‌పేట్‌లోని పలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసి అక్రమంగా నిషేధిత 125 మైక్రాన్‌ల లోపు ప్లాస్టిక్‌ను తయారు చేస్తున్నారు. ఈ తయారీ కేంద్రాలపై అధికారులు దాడులు చేసి సీజ్ అక్రమ తయారీదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం



కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

గోల్కొండ: రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసుధన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన గుడిమల్కాపూర్‌లో కిసాన్ మోర్చా పదాధికారులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అకాల వర్షాలకు వరి పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఎటువంటి కోత లేకుండా ప్రభుత్వం గతంలో ప్రకటించిన మద్దతు ధరకే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలోనే మంచిర్యాల, నిజామాబాద్ తదితర జిల్లాల్లో పర్యటించి రైతులను కలుసుకుంటామన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో తాము పర్యటించి రైతులను కలుసుకున్నామని ఆయన అన్నారు. వెంట కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, శ్రీనివాస్, వెంకటరమణ, ఎన్.వెంకటేష్‌గౌడ్, ఎర్రవల్లి రఘునాథ్ తదితరులున్నారు.

రజతోత్సవాలను విజయవంతం చేస్తాం



ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్‌ను అభినందిస్తున్న శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలను భారీ ఎత్తున నిర్వహించి విజయవంతం చేస్తామని ఆ పార్టీ ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణ్ అన్నారు. రజతోత్సవాల ఏర్పాట్లను సమీక్షించడానికి కార్వాన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నేతలు శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేద, బడుగు వర్గాల వారితో పాటు మధ్య తరగతి ప్రజల్లో కూడా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఉందన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతం అమలు చేశారన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాలన్నిటినీ గుట్టదాఖలు చేసిందని పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో శేఖర్ రెడ్డి తదితరులున్నారు.

హిందువులపై దాడులను అరికట్టాలి



అబిడ్స్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న పగుడాకుల బాలస్వామి తదితరులు

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: విశ్వహిందూ పరిషత్ నాయకులు, బజరంగ్‌దళ్ నాయకులు అబిడ్స్ చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వెస్ట్ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండను అడ్డుకోవాలని వీహెచ్‌పీ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. హిందువులపై మారణకాండ జరుగుతున్నా అక్కడి మమతాబెనర్జి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని నాయకులంతా ప్లకార్డులతో నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ..వెస్ట్‌బెంగాల్‌లో వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలన్నారు. బెంగాల్ నలుమూలలా రాక్షస పాలన కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులపై పనికట్టుకొని దాడులు నిర్వహించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా వక్ఫ్ చట్టం పేరు చెప్పుకొని హిందువులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వారి దాడులతో వేలాది మంది వలసబాటలు పడుతున్నారని బాలస్వామి పేర్కొన్నారు. వెంటనే మమతా బెనర్జి ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామారావు, అజయ్, అఖిల్, మోహన్‌కృష్ణ, ప్రవీణ్, అంకిత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్ కలెక్టర్‌కు వినతి..

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. శనివారం వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామితో పాటు పలువురు నాయకులు కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ..వెస్ట్‌బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించే వరకు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే అడ్డుకోవాలన్నారు. మమతాబెనర్జి ప్రభుత్వం హిందువుల వ్యతిరేకిగా మారిందని ఆరోపించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమైన బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్: గోషామహల్ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా నియోజకవర్గ పరిధిలోని అఫ్జల్‌గంజ్, గౌలిగూడ, ఇడ్లీగల్లీ, జాంబాగ్, రామభక్త సమాజ్, ఇతర ప్రాంతాల్లో నీటి సరఫరా కాకపోవడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారన్నారు. శనివారం వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో సమావేశమై వాటర్‌బోర్డు సమస్యలపై మెమొరాండం అందించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రియా గుప్తా, రవి యాదవ్, అహ్మద్ పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు ఎక్స్‌ట్రా మైల్ అవార్డు



శ్రీకాంత్‌కు మెమొంటో అందజేస్తున్న మినూసలుజా

గోల్కొండ: ఉత్తమ సేవలు అందించే వారికి యాజమాన్యం గౌరవించడమే కాక వారికి సంస్థలో మంచి పదవులు ఇవ్వడం జరుగుతుందని గ్లెండల్ అకాడా మీ డైరెక్టర్ మినూసలుజా అన్నారు. పదేళ్లుగా అత్యు త్తమ సేవలు అందిస్తున్న స్కూల్ అడ్మిన్ బి.శ్రీకాంత్‌కు ఆమె శనివారం ఎక్స్‌ట్రా మైల్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అత్యుత్తమ సేవలు అందించే వారు తోటి సిబ్బందికి మార్గదర్శకులు అవుతారని ఆయన అన్నారు. ఓ వైపు నిబంధనలను పాటిస్తూ మరో వైపు క్రమశిక్షణతో సేవలు అందిస్తున్న శ్రీకాంత్ మునుముందు మరిన్ని అవార్డులు పొందుతారన్నారు.

శ్రీవర్షకు సన్మానం



శ్రీవర్షను సన్మానిస్తున్న నాయకులు

గౌలిపురా: గ్రేట్ అండ్ ఒడేలాలో ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు బీఎఫ్ బీఎఫ్ఐ కాంటాక్ట్ సెవెంత్ యూత్ అండర్–19 అండ్ ఉమెన్స్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు గౌలిపురా నుంచి బొల్లారం శ్రీవర్ష ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం గౌలిపురాలోని ఆలే నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నర్సింగ్ ఆధ్వర్యంలో శ్రీవర్షను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జమాల్‌పూర్ చంద్రశేఖర్, మహేశ్, ప్రేమ్‌రాజ్, కృష్ణ, రమేశ్, కోచ్ ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో భారీ బందోబస్తు



లాల్‌దర్వాజా మోడ్ వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ శ్రీను

గౌలిపురా: వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా శనివారం దారుస్సలాంలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభను పురస్కరించుకొని పాతబస్తీలోని లాల్‌దర్వాజా మోడ్ వద్ద శనివారం పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఛత్రినాక డివిజన్ ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్, శాలిబండ, మొఘల్‌పురా, ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లతో కలిసి లాల్‌దర్వాజా మోడ్ వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తును శనివారం ఏసీపీ చంద్రశేఖర్ పరిశీలించారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన మజ్లిస్ నేతలు



గోల్కొండ: వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని నిరసిస్తూ శనివారం సాయంత్రం దారు సలాంలో జరుగుతున్న నిరసన బహిరంగ సభకు టోలిచౌకీ, నానల్ నగర్, గోల్కొండ తదితర డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మజ్లిస్ సీనియర్ నాయకుడు షకీల్ అలీఖాన్ మాట్లాడుతూ..ముస్లిం వ్యతిరేక విధానాలతో కొత్త చట్టాలను రూపొందించడం, పాత చట్టాలను సవరించడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆయన అన్నారు. మరోవైపు షేక్‌పేట్ నుంచి మజ్లిస్ నాయకుడు మహ్మద్ ముస్తాఫా ఆధ్వర్యంలో షేక్‌పేట్ నాలా నుంచి మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు భారీగా దారు సలాంకు తరలివెళ్లారు.

నృత్యం రక్తి కట్టాలంటే అభినయం అవసరం



నృత్య అభినయం నిర్వహిస్తున్న నృత్య గురువులు

సుల్తాన్‌బజార్: నృత్య ప్రదర్శన రక్తి కట్టాలంటే అభినయం ఎంతో అవసరమని ప్రముఖ నృత్య గురువులు నిష్ఠల సుధామాల అన్నారు. నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో శనివారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో ప్రముఖ ప్రఖ్యాత నర్తకి పద్మభూషణ్ విదూషి స్వప్న సుందరి నిర్వహిస్తున్న చైత్ర చంద్రిక అభినయ వర్క్‌షాప్ ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ వర్క్‌షాప్‌లో నృత్య గురువులకు, యువ కళాకారులకు స్వప్నసుందరి ఆలయ సంప్రదాయ కళాకారిణిలలో మౌలికంగా ప్రచారంలో ఉన్న అరుదైన జావలికి అభినయం చేసే విధానంలో మెళకువల్లో అవగాహన కల్పించారు. అలాగే అభినయ విద్యలో ప్రతి సాహిత్య పాదానికి పదార్థ అభినయం, వ్యాఖ్యార్థ అభినయం, విశేష అభినయం చేసే పద్ధతిని నేర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..కాలానికి అనుగుణంగా నృత్యంలో కూడా అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నృత్య గురువులు మధుమతి కులకర్ణి, డాక్టర్ ఇందిరా, హేమ, సమితి అధ్యక్షుడు హేమరాజు విజయ్‌కుమార్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహిళా భారతి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి భాష్యం అనురాధ రచించిన తనబ్బి పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. తెలుగు అధ్యాపకురాలుగా విధులు నిర్వహించిన రచయిత్రి అనేక అంశాలను పుస్తకరూపంలోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సహస్ర కవి సమూహం అధ్యక్షులు మేక రవీంద్ర, రచయిత చింతపట్ల సుదర్శన్, మహిళాభారతి అధ్యక్షులు దాసోజి పద్మావతి, అక్షర కౌముది ప్రధాన కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్‌నిర్మాణం పనులు ప్రారంభం



గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో వేదాందం రాజు పంతులు ఆధ్వర్యంలో శనివారం ఆలయ పునర్‌నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు అల్లం శ్రీనివాస్, మధుశ్రీ దంపతులు, వారి కుటుంబసభ్యులు, ఆలయ చైర్మన్ సాకెల్లి సర్వేశ్ కుమార్, ఆలయ అధ్యక్షులు కాలే శ్రీనివాస్, విష్ణుచారి, మధుచారి, గనతి కృష్ణ, ప్రవీణ్, శ్రీనివాస్ (మామ), శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మే 20న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం బడిచౌడి నుంచి కోఠి ఉమెన్స్ కళాశాల బస్టాప్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు కె.కుమారస్వామి మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు మార్చి 8న ఢిల్లీలో సమావేశమై దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు మే 20న దేశవ్యాప్త సమ్మె చేయాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, కిషన్, అజయ్ బాబు, పద్మ, శివబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'రన్‌ఫర్ జీసస్'



ర్యాలీలో జేరుసలేం మత్తయ్య తదితరులు



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు

సుల్తాన్‌బజార్: మానవాళి పాప ప్రాయశ్చిత్తం ఏసు శిలువ మరణం ద్వారానేనని ఆరాధన టీవీ ఛానల్ చైర్మన్ పాల్ దేవీ ప్రియం పుల్ల అన్నారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకొని సికింద్రాబాద్ సెయింట్ మేరి చర్చి నుంచి అబిడ్స్ జార్జెస్ హైస్కూల్ వరకు జరిగిన రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో అన్ని చర్చిల పాస్టర్లు, క్రైస్తవ నాయకులు సమైఖ్యంగా కలిసి రన్‌ఫర్ జీసస్ నిర్వహించారు. రన్‌ఫర్ జీసస్ దేశ వ్యాప్తంగా 600 ప్రాంతాల్లో శనివారం జరిగిందన్నారు. హెబ్రోన్ సువార్తికులు బ్రదర్ ఆనంద్ మాట్లాడుతూ.. ఏసు సజీవుడు అని ఆయన మృతిచెంది తిరిగి లేచినారన్నారు. ఈ ర్యాలీలో ఉషాపాల్, కేవి.పాల్, ప్రసన్న, జేరుసలేం మత్తయ్య, జోస్ఫిన్‌లతో పాటు 300 మంది పాల్గొన్నారు.

ఓల్డ్‌సిటీ చార్జెస్ కన్వీనర్ ఆధ్వర్యంలో..

బహదూర్‌పురా: నగర వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుంచి రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి క్రైస్తవులు వేలాదిగా తరలివచ్చారు. ఓల్డ్‌సిటీ చార్జెస్ కన్వీనర్ అరవింద్ బుర్రగల్ల ఆనందం ఆధ్వర్యంలో బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, గోషామహల్, కార్వాన్, చార్మినార్, యాకుత్‌పురా, రాజేంద్రనగర్, ఖైరతాబాద్ తదితర నియోజకవర్గాల క్రైస్తవులు పెద్ద ఎత్తున సికింద్రాబాద్ నుంచి అబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ స్కూల్ వరకు ర్యాలీగా పాటలు పాడుతూ రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు దివాకర్, దర్శన్, సుధాకర్, ఆనంద్ కుమార్‌తో పాటు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రాఫికర్

గోల్కొండ: గోల్కొండకు వెళ్లే బంజారా దర్వాజా, ఫతేదర్వాజాల వద్ద ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. టోలిచౌకీ, షేక్‌పేట్, అలీజాపూర్ నుంచి గోల్కొండ వెళ్లే వారు బంజారి దజ్వాజా గుండా వెళ్తారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో గచ్చిబౌలి నుంచి లంగర్‌హౌస్ వెళ్లే వారు షార్ట్ కట్ పద్ధతిలో గోల్కొండ బంజారా దర్వాజా గుండా వెళ్తున్నారు. దీంతో బంజారా దర్వాజ ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాలతో రద్దీగా ఉంటుంది. మరోవైపు పాతనగరం నుంచి గోల్కొండ వచ్చే వారు కూడా ఫతేదర్వాజా గుండా వస్తారు. లంగర్‌హౌస్, కార్వాన్‌ల నుంచి గోల్కొండకు వచ్చే వారు ఫతే దర్వాజా నుంచి వస్తారు. ఈ దర్వాజాల గుండా కేవలం ఒక సమయంలో ఒక వాహనం మాత్రమే వెళ్లగలుగుతుంది. బస్సులు, కార్లు వెళ్లాలంటే ఒక వైపు నుంచి వెళ్లిన తర్వాత అటువైపు వెళ్లాల్సి వస్తుంది. ఫతేదర్వాజా వైపు కూడా ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇదిలా ఉండగా బంజారా దర్వాజా వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించాలంటే టోలిచౌకీ నుంచి గోల్కొండ వెళ్లే వాహనాలను గోల్ఫ్ కోర్ట్ మీదుగా జమాలి దర్వాజా వైపు మళ్లించాలని దీన్ని వల్ల గోల్కొండ కోటకు వెళ్లే వారికి ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని స్థానికులు అంటున్నారు. ఏదేమైనా ట్రాఫిక్ పోలీసులు బంజారా దర్వాజా, ఫతేదర్వాజాల వద్ద ఇరువైపులా కూడా విధులు నిర్వహిస్తున్నా కూడా ట్రాఫిక్ జామ్‌ను అరికట్టలేకపోతున్నారు.



గోల్కొండ బంజారా దర్వాజా వద్ద ట్రాఫిక్